


# శ్రీనివాస చింతన


రచన :

అమరవాది సుబ్రహ్మణ్య దీక్షితులు

M.Tech

# ప్రార్థన

సీ॥ శ్రీనివాసుని కోరి చేరదల్చుటయన్న
కత్తితో సాముని కనరె మీరు
వాని పాదము బట్ట వామనుడై వాడు
కాలితో త్రొక్కును కలత వలదు
పుత్తడి నేరీతి పురము పట్టెదరట్లె
కాల్చిబూదిని జేయ కాదు అనక
తన్నెడి కాల్బట్టి దయకోరి వేడిన
కాపాడు తప్పక కరుణ జూపు

తే॥ నేనె ఋజువును సాక్ష్యము దీనికెల్ల
వినుడు నామాట ప్రేమతో విన్నవింతు
అదియె జ్ఞానము జ్ఞేయము ఆదితుదియు
చేరి అనుడయ్య పలుమార్లు శ్రీనివాస

కం॥ నిలచిన స్థలమున నిలువవు

నిలకడ కలనైన కలదె నెలవేది ప్రభూ

నిలు నిలు నాలో నిలు నిలు

నిలుపగ లేకుంటి నిలుము నీవే నాలో

మ॥ కలరే యీయెడ చింత దీర్పగను ఓకారుణ్యసింధో! రమా

లలనా రత్నము ప్రీతితో పిసుకు నీ లావణ్య పాదాబ్జముల్

ఇలరానేలర అన్ని మెట్లు దిగుచున్ ఎంతైన నేనుంటిగా

పిలువన్ రాదొకో పంతమేల దరికిన్ ప్రేమావతారా ప్రభూ!

కం॥ కలడందురు మౌనుల యెద

కలడందురు భక్త కవుల గాయకులందున్

కలడందురెచ్చటైనను

కలవయ్యా కలవునీవు ఘనముగ దేవా!

# అంకితం :



కం॥ ఉన్నావనుకొను వారికి

ఉన్నానని వెన్నుదట్టు ఓ శ్రీకృష్ణా

ఉన్నావాయని నసిగిన

అన్నా నువులేవు నీకె అంకితమయ్యా

# శ్రీనివాస చింతన

సీ॥ ఎటువంటి వాడన్న ఏమని చెబుదును
అదితెలియగలేక అవిసిరెల్ల
ఎక్కడి వాడన్న ఏమని చెబుదును
ఎక్కడైనగలవు ఇచ్చతోడ
ఎవ్వరి వాడన్న ఏమని చెబుదును
అందరివాడంచు అంటివీవే
ఎన్నటివాడన్న ఏమని చెబుదును
కాలపరిమితేది ఘనుడనీకు

తే॥ ఆదిమధ్యాంతములులేని అనఘుడీవు
ఇందుగలడందులేడని ఏలశంక
జగతికాద్యంతములు నీవె జనకుడీవె
చిత్తగించుము ఓదేవ శ్రీనివాస

సీ॥ కన్నులు  ఏరీతి కనుపింప జేయును
ఏదిలేకను అంధులౌదురిలను
చెవ్వులు ఏవిధి చేకూర్చు శ్రవణము
ఏదిలేకున్నచో బధిరుడౌను?
చర్మంబు ఏ లీల స్పర్శను దెల్పును
ఏరీతి నాలుక ఇచ్చు రుచిని
నాసిక ఏ రీతి నరులకు ఆఘ్రాణ
శక్తినిచ్చును దెల్ప శక్యమగునె

తే॥ అదియె లేకనె ఇది అయ్యె అనుటె గాని
అద్ది ఎందుకు లేకుండె? ఆ వివరము
ఎరుక కాకుండెఅందుకే దారి నీవె
చిత్తగించుము నా మొర శ్రీనివాస

సీ॥ ధృతరాష్ట్ర భూపతి దృష్టి ప్రసాదించి
విశ్వరూపము జూపు వేల్పు వీవు
దరిజేరి దుష్టుల తాత ఆ భీష్ముచే
విష్ణు సహస్రమున్ వింటి వీవు
దుష్టుల మంత్రివిదురుని ఇంటికిబోయి
ప్రీతితో విందుల గతికినావు
దుష్ట దుర్యోధను నిష్టసఖుండైన
ఆ కర్ణు బ్రతిమాలి అలసినావు

తే॥ ఎవ్వరెవ్వరి వృత్తితో ఎన్నడేని
నీకు పనిలేదు భక్తుల నెమ్మితోడ
బ్రోచి రక్షించు దైవమా పుణ్యమూర్తి
చిత్తగించుము నామొర శ్రీనివాస

సీ॥ దుశ్శాసనుడు నాడు దుశ్చర్య పూనగ
ద్రౌపది రక్షించి ఆపినావు
దుర్వాసముని యొక్క దురితక్రోధమునుండి
పాండవులకు కీడు బాపినావు
నాడు అశ్వథ్థామ నారి ఉత్తరగర్భ
ఛేదనకైజూడ చెరపినావు
రుక్మి మీసము సగం రోతగ గొరిగించి
బావని హాస్యోక్తి వదలినావు

తే॥ తోడు నీడగ నీవారి తోయజాక్ష!
దుష్టజనముల ఆపదల్ దునిమినావు?
శిష్టరక్షణ ఆ వెన్క చేసినావు
చిత్తగించుము దీనుల శ్రీనివాస

సీ॥ ధృతరాష్ట్రుడా భీము ధృఢమైన కౌగిట

చంపజూడగ కాచి ఆపినావు

కర్ణుడుశక్తిచే కౌంతేయు గొట్టగా

రధమును క్రుంగించు రక్షనీవు

భీష్ముడుమరణించు వివరమ్ము చెప్పించి

అంతమొందించావు అర్జునునితొ

చక్రమడ్డము వేసి సైంధవుక్రీడిచే

మడియించినావయ్య మాయ చేసి

తే॥ అడుగు అడుగున ఆపదల్ ఆపినావు

మాయయుక్తుల దుష్టుల మట్టుబెట్టి

సుజనరక్షణ చేసిన సురులనేత

చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ సువిశాల విశ్వాన సూర్యుడే ఒక చుక్క
దానితోపోల్చిన ధరణి ఎంత
వసుధలో మూడవ వంతుండు ఈ నేల
దీనిలో మనదైన దేశమెంత
దానిలో ఆంధ్రులదైన భూమది యెంత
అందులో మనవూరు అదియునెంత
ఊరిలో మన ఇల్లు ఊహింపగానెంత
ఇంటిలో మనచోటు ఎరుగనెంత

తే॥ సిగ్గుగాతోచె నేనెంత చిన్నవాడ
విశ్వరూపుడ నీకివే వేల నుతులు
నలుసునని మరువను తండ్రి నాగశయన
చిత్తగించుము నా మొర శ్రీనివాస

సీ॥ కళ్లుచూడగలేవు కనురెప్పలార్పవు
నీకరుణే లేక నీరజాక్ష
చెవ్వులు వినలేవు చెలరేగి అరిచినా
నీదయలేకున్న నీలవర్ణ
స్పర్శజ్ఞానము లేక చరియించుటేగతి
నీ కృపలేకున్న నిఖిల వంద్య
నాలుక కలిగియు పలుకలేడు కదయ్య
నీ ఆనతేలేక నిశ్చయముగ

తే॥ మెదడు ఉండియు లాభమే లేదు దేవ
వెర్రివాడయి బ్రతికినన్ వెతలతోడ
దీని తెలియుట జ్ఞానము దిక్కునీవె
చిత్తగించుము నామొర శ్రీనివాస

సీ॥ సూర్యుడు ఒకచోట సుస్థిరమ్ముగనుండు
కక్ష్యలన్ తిరుగును గ్రహములన్ని
సోముడై ఉపగ్రహమమరెను భూమికి
మంగళుడు రవికి మన్నెగ్రహము
బుధుడును గ్రహముగా వుండెనా రవికిని
గురుడు గ్రహంబుగా కుదిరె రవికి
శుక్రుడు గ్రహమయ్యె చూడనా రవికిని
శని వింతగ్రహమయ్యె సవితునికిని

తే॥ రాహుకేతులు గ్రహములన్ లాక్షణకులు
ఇంద్రవరుణులు అందురుఎల్ల జనులు
వీటికక్ష్యలు మారవు వింతకాదె
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ పాటలు వేలాదిపాడిన ఘనమౌనె
వాసుదేవుని కీర్తి పాడకున్న
మాటలు సభలలో మాట్లాడిమేలౌనె
మధు వైరి మాటలు మానినపుడు
రచనలు వేలాది రచియించి లాభమే
రాధాప్రియుని కీర్తి వ్రాయకున్న
నాటకాలాడిన నయమేమి నటునకు
నారాయణుని వేషధారిగాక

తే॥ లలిత కళలకు ధరలోన లక్ష్యమేమి
ధనము మనవెంట రాదంచు కనరు జనులు
నిన్ను మరతురు కధ ఇదే ఎన్నటికిని
చిత్తగించుము ఓ స్వామి శ్రీనివాస

సీ॥ వెలదుల కోరును నెలతల కోరును
కలకంఠులను కోరు కామినులను
వనితల వాంఛించు పడతుల వాంఛించు
ప్రమదల వాంఛించు భామినులను
మోహించు ముదితల మోహించు యువతుల
రమణుల మోహించు లలనలెల్ల
కోరును తరుణుల కోరును పొలతుల
ముదితలెల్లర కోరు సుదతులెల్ల

తే॥ ఆశ కాంతల వీడదు అవని వీడు
ఆశ చానల వీడదు అన్నివీడు
అన్నిటిని వీడు చివరకు నిన్ను కూడ
చిత్తగించుము ఈ ఆట శ్రీనివాస

సీ॥ నీ భార్య లక్ష్మికి నేటికీ దాసులై
జగమెల్ల కొల్తురు చచ్చుదాక
నీ కొడుకా బ్రహ్మనెన్నుదురులపైన
ఏ వ్రాత వ్రాయునో ఎవరికెరుక
నీ కోడలే వేడ నిలచునా నాల్కపై
ఆ సరస్వతి లేక అవని లేదు
నీ బిడ్డ మదనుడు నీతి తప్పును స్వామి
చచ్చి సాధిస్తాడు పిచ్చిగరపి

తే॥ వీరినందరి కోరినిన్ విడిచి మరచి
పిలుపు వచ్చాక ఫలమేమి నళిననాభ
మరల జన్మైన లాభమే మాయలేల
చిత్తగించుము నా మొర శ్రీనివాస

సీ॥ కోట్లాది ప్రజలెల్ల కోరి పూజింతురే
దేవుడు భూమిపై తిరిగెనంచు
గొప్పగా జనులెల్ల కూడుచు విందురే
గురువని భాషణల్ గురినిబెట్టి
కూడి దేశ విదేశపుడమి పాటింతురే
వాని ఆజ్ఞలు వీడువారుగాక
స్త్రీయని చూడక చేరి భావింతురే
అమ్మని తలచుచు ఆర్తి తోడ

తే॥ వీరి మహిమలు కావయ్య విన్న వింతు
నీదు అంశవారిలొ చేరి నిలుచుగాక
వారు మలమూత్రములు వీడు బ్రతుకు జనులె
చిత్తగించుము ఓ స్వామి శ్రీనివాస

సీ॥ అన్నమయ్యను గాను అలరు కీర్తనలచే
నిను పాడి మెప్పించ నీరజాక్ష
త్యాగయ్యనే గాను ధన్యుడై పాడుచు
నీ దయ నొందగనెనరు తోడ
క్షేత్రయ్యనే గాను సేవించి పదములు
నీపైన పాడుచు నిన్ను పొంద
రామదాసును గాను రంజిల్లు రీతిగా
గుడికట్టి నీదయన్ కూడ్చు కొనగ

తే॥ పూర్వజన్మలఫలముచే పుడమిపుట్టి
జ్ఞానమందిరి నినుపాడి జనులకెల్ల
ముదమునందించి చూసిరి ముక్తి పథము
చిత్తగించుము ఓ దేవ శ్రీనివాస

సీ॥ ఆదిలక్ష్మిగ సృష్టికాదియే ఆయమ్మ
వరలక్ష్మి యై ఇచ్చు వరములన్ని
ధనలక్ష్మి ప్రజలను ధనముల దేల్చును
గజలక్ష్మిగా తానె పూజలందు
ధాన్యలక్ష్మిగ తల్లి తానె ఆకలి తీర్చె
సంతానలక్ష్మియై సంతునిచ్చె
ధైర్యలక్ష్మిగమారి తెగువనిచ్చెను తల్లి
విజయలక్ష్మిగ తానె విజయమిచ్చె

తే॥ అష్టలక్ష్ములు అలరారె అవనియందు
వారికొలుచుట చాలదు ఒరుల తోడ
'లక్ష్మి' పంచక లభ్యమై లాభమేమి
చిత్తగించుము ఓ స్వామి శ్రీనివాస

సీ॥ పాపడై ఏడ్చుచో పరులెవ్వరైననున్
ఏడ్పుకారణమేదొ ఎరుగలేరు
కౌమార దశలోన కౌతుకంబాటలన్
గమ్యంబు లేకుండ గడుపుచుండ
యౌవనుడౌనెడ యావతో స్త్రీతోడ
రతిలోనె జీవించు రమణి చేరి
ప్రౌఢదశను పొంది బాధ్యతగానెంచి
పిల్లపాపల పెంచి పెద్దచేయు

తే॥ చేరి వృద్ధాప్యదశనొకే చింత గడుపు
మాయ ఏమియో తెలియదు మఱచు నిన్ను
యముడు పిలిచిన పరిగెత్తు అవని నుండి
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ దాస్యము చేయుట ధరణిలో ఒరులకు
దారిద్ర్యమను నట్టి దశను యుంట
భార్యావియోగాన బ్రతుకుట ఒంటిగా
తనకు హానిని తనేపూను కొనుట
చేజాచి ఒరులను సిగ్గు విడ్చుడుగుట
అడిగిలేదని చెప్ప అణగియుంట
వ్యాధిచేతను పలు బాధలు పడుటయు
వృద్ధాప్యమున చావు భయమునుంట

తే॥ అష్టకష్టములందురు అనుభవింత్రు
వీటి నెరిగించగా నెంచి ఇటుల చెబితి
భక్తకోటిని కావుము వాటి నుండి
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ కశ్యపుడాద్యుడు ఘనుడు సప్తఋషుల
అత్రి రెండవవాడు అధికుడతడు
ఆ భరధ్వాజుడు అన్ని నేర్చినమౌని
గాధేయుడందరన్ ఘనుడు బ్రహ్మ
గౌతముడెంతయో అతులిత జ్ఞానియౌ
ఆ వశిష్టుడు మేటి అతడె గురుడు
జమదగ్ని శ్రేష్టుడు జనకుడు ఆతడే
పరశురామునివంటి గురువుకైన

తే॥ సప్త ఋషులన్న వీరిని సన్నుతింతు
అత్రి సతిని అరుంధతినాకశమున
పెళ్లిరోజు నింగిని చూడ ప్రియము కలుగు
చిత్తగించుము ఓ దేవ శ్రీనివాస

సీ॥ మత్స్యకూర్మములయ్యె మాధవుడానాడు
కిటిరూపమును యెత్తి కీర్తి గనెను
నారసింహుండయ్యె నారాయణుండట్లె
వామనుడై పూని బలిని ద్రొక్కె
పరశురాముండాయె పనిబట్టె రాజుల
రాముడై మౌనుల రక్షనిచ్చె
కృష్ణుడై ధర్మము గరిపెను గీతచే
బుద్ధుడై శాంతిని బోధ చేసె

తే॥ కల్కిరూపాన దుష్టులన్ కత్తితోడ
నరుక రాగలవందురు నళిననాభ
నేడు దశ అవతారాల విడమరచితి
చిత్తగించుము ఓ స్వామి శ్రీనివాస

సీ॥ మూడడుగుల నేల ముద్దుగా అడిగావు
నాకేల ధనమని నమ్మ బలికి
నాకేమి తెలియును నారాయణుండని
రాముడనన్నావు రాజ్యమేలి
మన్నేల నాకని అన్నిలోకాల్నోట
జూపి తల్లికి భ్రాంతి జొప్పినావు
పెళ్లి ఖర్చులకైన వెంటనుండాలని
అప్పుకు వడ్డీల అలసినావు

తే॥ ఎంత మాయలమారివి ఇన్ని చేసి
నేడు నామాల స్వామివౌ నిన్ను జూడ
ఒళ్ళు పులకలుదేలును కళ్ళు చెమరు
చిత్తగించుము నా మొర శ్రీనివాస

సీ॥ అమ్మ ముద్దులు పెట్టు అందరినొకెరీతి
పెంచు ప్రేమను యిచ్చి పేర్మి జూపు
సుదతి ఒక్కతి యగు సుగుణాల ప్రోవుగ
వారకాంతొక్కతై వసుధ తిరుగు
అయ్యపెంచును కూర్మి ఆతని బిడ్డలన్
చదివించునందరన్ శ్రద్ధతోడ
ఆచార్యుడొక్కడై అతిశయించును భువిన్
చదువు అంటని వట్టి చవట ఒకడు

తే॥ ఎవరి నుదుటను ఏ వ్రాత ఎట్లు గలదొ
తెలియలేరయ్య ఎవ్వరు నళిననాభ
మంచి చెడ్డలు నీపైన ఉంచినాము
చిత్తగించుము నా మొర శ్రీనివాస

సీ॥ ఎక్కడున్నాడని తిక్కగా ప్రశ్నించి

టక్కుచూపి అడిగె దానవుండు

"ఎక్కడ లేడని" చక్కగా బదులిచ్చి

అక్కడే చూపెను అతని సుతుడు

ఎక్కడా లేవని తక్కువగా జూచి

రక్కసుల్ బూడిదరాసులైరి

ఎక్కడున్నాగాని దిక్కునీవేయంచు

వెక్కిరి మాబోటి వెర్రివారు

తే॥ చిక్కు విడదీయ నీకేయౌ చిద్విలాస

నిఖిల జగతికి రక్షవు నిక్కముగను

మక్కువను జూపి ఆదుకోమమ్ము ఎపుడు

చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ జూదమాడుటయొక్క ముదనష్ట వ్యసనము
స్త్రీలను కోరుట చితికి జనుటె
మద్యము త్రాగుట మతిపోవు అలవాటు
వేటయౌ వ్యసనము వెతల కూర్పు
కఠిన భాషణయును కడునీచ వ్యసనంబు
కనరాక మనలను కలతపెట్టు
పరుల సొత్తుల దోచ బాధించు తగదది
పరనింద జేయుట వ్యసనమగును.

తే॥ సప్త వ్యసనము లేవియో సవివరముగ
తెలుపగోరి ఈ విధమున తెలిపినాను
వాటినుండి రక్షించు మో వాసుదేవ
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ ఒక్కడే దైవంబు ఒప్పెనీ జగమందు
మంచిచెడులు రెండు యెంచి చూడ
త్రిగుణములేవియో తెలియంగ చెప్పుదు
సత్వ రజో తమస్సనగనుండు
ధర్మార్థకామముల్ తదుపరి మోక్షమ్ము
నాలుగు పురుషార్థములును కలవు
నేల, నీరము, గాలి నింగియు, నగ్నియున్
పంచ భూతములంచు యెంచబడియె

ఆ॥ తిథియు వారములును తెలియంగ నక్షత్ర
యోగ, కరణములను బాగుగాను
పంచఅంగములని పాయక తెలిపిరి
చిత్తగించుమయ్య శ్రీనివాస

సీ॥ చాకలోడినివిని సతిని కానలకంపి
పేరు తెచ్చినదేమి వేదనొకటె?
పాండుజూదరులకు బాధలతప్పించి
బడసిన పేరేమి పక్షపాతి
ధర్మము వీడినన్ తలకాచి ఇంద్రుని
వసుధను సురపక్షపాతివనిరి
వేలాది భక్తుల వేదన తీర్చినా
వడ్డివాడైతివి పాపమేమొ

తే॥ నీకు తోచిన న్యాయము మాకు తెలియ
సాధ్యమే కాదు అందుకే జగతియందు
నిలిచియుంటివి మౌనివై మేలు మేలు
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ కాలనేమిని నాడు కాటికంపుటె కాదు
కనుమూయనీయవే కంసుడవగ
కేశిమాయలనన్ని నాశనమొనరించి
కేశవుడను ఘనకీర్తి గాంచి
కైటభదైత్యుని కీర్తినిచ్చితివయ్య
వాని పుణ్యంబేమొ వసుధయందు
ఖరునకు  నేటికిన్ గాఢమైనట్టిదౌ
పేరునందించేవు పేర్మితోడ

తే॥ మహిని మురవైరి అను పేరు మారుమ్రోగె
పేరు మధుసూదనుండని వినరె జనులు
పోరినీతోడ కీర్తిని పొందిరయ్య
చిత్తగించుమ్ము మా మొర శ్రీనివాస

సీ॥ పూతన చేసిన పుణ్యమేమోగాని

చనుబాలుద్రాపించి చావునొంద

బకుడు తాచేసిన భాగ్యమేమోగాని

చచ్చెనీచేతిలో శాంతిపొందె

రజకుడు చేసిన పూజలేమోగాని

నిహతుడై నినుపొందె నెమ్మితోడ

కేశితాపాడిన కీర్తనలేమయ్య

కేశవ నీచేత నాశమొంద

తే॥ వారు చేసిన పూజలు వాసుదేవ

నాకు వశమౌనె కాదయ్య నళిననాభ

పోల్చనేలయ్య వారితో పోలగలనె

చిత్తగించుము నామొర శ్రీనివాస

సీ॥ అవనిలో నరులకు నల్గురౌదురు తగన్
తండ్రితోటి సములు తథ్యమిదియె
జన్మనిచ్చిన తండ్రి జనులకు ప్రథముడు
బ్రహ్మోపదేశంబు పలుకువాడు
శ్రద్ధగా తనకును చదువు చెప్పినవాడు
ఆపదన్ భయమును అణచువాడు
ఆకలి తీర్చనై అన్నము పెట్టిన
ఆప్తుడు అవనిలోఅయ్యకాడె

ఆ॥ కన్నతండ్రి కాకయున్నను వీరిని
తండ్రిలాగ జనులు తలవవలెను
కొరివిబెట్టవచ్చు కొడుకుగా ఎవరైన
చిత్తగించవయ్య శ్రీనివాస

సీ॥ పంచమహా పాపమంచని వేనిని
అందురో తెలియగనగును ఇచట
బంగారమును పూని దొంగిలించుటయును
మద్యంబు త్రాగుట మత్తుకలుగ
పరుల సొత్తుల నపహరణమ్ము బాధించు
గురుపత్ని వాంఛించికూడుటయును
ఘోరపాతకులతోకూడి నెయ్యము చేయు
టయునుపాపమ్మది తగదు భువిని

ఆ॥ వీటికేది శిక్ష వేర్వేరు గురువులు
తోచినట్లు అనిరి తుదకు నేను
జన్మవీడి మరల జనియించ శిక్షందు
చిత్తగించవయ్య శ్రీనివాస

సీ॥ మముగన్న తల్లియే మాకు విషంబీయ
మముగాచు వారొండు మహినిగలరె
మము కన్నతండ్రియే మము అమ్మజూచిన
మముగాచువారొండు మహినిగలరె
మా ధర్మపత్నియే మాకధర్మము జేయ
మముగాచువారొండు మహినిగలరె
మా కన్నబిడ్డలే మముదోచ తలచిన
మముగాచువారొండు మహినిగలరె

తే॥ జగతిబుట్టించి పోషించు చక్కనయ్య
నీవె మాపైన కక్షతో నిప్పుబెట్ట
ఆపు వారెవ్వరో అయ్య అవనియందు
చిత్తగించుము మామొర శ్రీనివాస

సీ॥ తండ్రి లేడట నీకు తల్లియున్ లేదంట
జననమే లేకున్న మనుదువెట్లు
తోడులేదటనీకు తోబుట్లు లేరంట
పెరిగితివేరీతి ఎరుక కాదు
సఖులు లేరట నీకు సతులెల్ల ఊహంట
చరియింతువేరీతి సాధ్యమగునె
గురుడులేడటనీకు గోత్రమేలేదంట
చదువుసంధ్యలులేక సాగుదువుట

తే॥ జన్మలేనట్టి తండ్రివి జగతికంత
ఆదిమధ్యాంతరహితుడవయ్య నీవు
మిగిలినన్నియూ జనియించె మెదడునుంచె
చిత్తగించుము ఓదేవ శ్రీనివాస

సీ॥ చక్రహస్తుడవంచు సంబరపడితినే
జతనాదు క్రోధమ్ము చంపవేల
కోదండ పాణని గొప్ప యాసతొ నున్న
ననుబట్టు కామమ్ము దునుమవేల
నందకహస్తుడా నడియాస నేనుంటి
నను జేరు మోహంబు నరకవేల
కౌమోదకీహస్త గర్వాన నేనుంటి
మద మత్సరంబుల మోదవేల

ఆ॥ లోభమడగ ద్రొక్కు అభయము నీయవే
నాదు అరులకావ న్యాయమేన
నాకు సాధ్యమౌనె నరకంగ వాటిని
చిత్తగించ వయ్య శ్రీనివాస

సీ॥ లక్షలుండియు మేలు రవ్వంతయును లేదు

లడ్డొకటి తినలేని రాజుకైన

భవనాలు పదియుండి ఫలమేమి నగరిలో

అడుగులేయగలేని అవిటివాన్కి

చదువెంత చదివియు అదియేల కాల్పనా

సంస్కారమే లేని చవటలకును

పేరుండి ఫలమేమి మరణించు నాడైన

పదిమంది రాకున్న పలుకరించ

తే॥ శక్తి ఎంతుండి ఫలమేమి సమయమునకు

తమ్ము కాపాడుకోలేని తమ్ములకును

అట్టివారిని కాపాడు అవనియందు

చిత్తగించుము నా మొర శ్రీనివాస

సీ॥ తల్లిదండ్రులనుచు తనివార కొలువక
దానాల ఫలమేమి ధరణి వీడ
బ్రతికియున్నప్పుడు పట్టెడన్నము లేదు
తద్దినమ్ముల పేర తానె తినును
కట్టుబట్టీయక కడగండ్ల పాల్జేసి
వస్త్రదానంబుల బడయరేది
రోగమొచ్చిన వేళ మ్రింగమందీయక
వైద్యశాలలు గట్టుటగునె మేలు

ఆ॥ కాయముండు వేళ కాసింత చూడక
పైకి చేరి నపుడు ప్రేమలేల
తరతరాల నుండి జరుగుతున్నదియిదే
చిత్తగించ వయ్య శ్రీనివాస

సీ॥ కన్నీరు తుడుచుచు కరుణ చూపించని
అక్క చెల్లెళ్ళుండి అగునె మేలు
రోగమొచ్చినవేళ రుద్దుచు నుదుటిని
కూరిమి చూపని కూతురేల
కడుపార తినుటకు కమ్మగ పెట్టని
కోడళ్లవలనేమి కూడగలదు
దరిజేరి తాతని నోరార పిలువని
మనుమరాళ్ళుండియు మనిషికేమి

తే॥ తల్లి రూపాలె వీళ్ళంత ధరణిలోన
బ్రతికి ఉన్నప్పుడే కాని పైకి చేరి
వారు కోరేది ఏముంది కోరి నయమె
చిత్తగించుము ఓ దేవ శ్రీనివాస

సీ॥ మారీచు బోలిన మాయావినా నేను
మాయలేడిగ మాయ జేయలేదు
ఖరదూషణాదుల కడసోదరుండనా
కత్తిగట్టితివేల కరుణవీడి
వాలి బోలిన యట్టి వానరుండను గాను
తమ్ముని భార్యతో తగల లేదు
కుంభకర్ణుని వంటి కౄరుండనా నేను
కోదండపాణివై కోలగొట్ట

తే॥ వారినందరి వధియించి వాసుదేవ!
జగతి కళ్యాణమొనరించ బాగు బాగు
నన్ను పీడించ న్యాయమా నళిన నేత్ర
చిత్తగించుము నామొర శ్రీనివాస

సీ|| కన్నులు మూడంట కంఠాన విషమంట
నెలవంక గంగమ్మ నెత్తినంట
సర్పాలెనగలంట చర్మమే బట్టంట
సగపాలు మేనిలో సతియెనంట
ఒడలంత బూదంట ఒంటిగాతపమంట
చేత త్రిశూలంబు చేరెనంట
భూతప్రేతములన్ని జతయంటనీవెంట
తాండవంబాడనై ఢమరుకమట

తే|| శైవులందరు తలచిరి శివుడవంచు
నేను హరికొల్తునని నీవు నిరసనముతొ
ఒదలబోకయ్య హరిహరుల్ ఒక్కటయ్య
చిత్తగించుము ఓదేవ శ్రీనివాస

సీ॥ తన తల్లి తనముందె తగులును ఒరులతో
శిక్షగు వేరేది చెప్పవయ్య
తనచెల్లి దొంగగా తనముందె తిరుగంగ
ధరణి నరకమేది దానికంటె
తనయాలితను దిట్ట తలవంచి ఏడ్చుటే
వేరేది శిక్షుండు నరకమందు
తనపాప హంతకై తనముందె ఉరినొంద
అంతకన్నను శిక్ష అవని కలదె

తే॥ నూనె వేపుట అంపాల తునుముచుంట
కొట్టకొరడాల శిక్షగు పట్టినరుక
నరక బాధలు లేవయ్య వేరుచోట
చిత్తగించుము నామొర శ్రీనివాస

సీ॥ గుడ్డి వాడికెవండు అడ్డగించును చావు
ప్రతిరోజు తోడుండి వానిగాచు
కుంటివాడినెవండు జంటయై కాపాడు
పడిపోవ గాయాల బారినుండి
చెవిటివాడికెవండు చేదోడు వాదోడు
దినదిన గండాల వానిగాచు
పిల్లపాపల కాచు పెన్నిధి ఎవ్వండు
బ్రతికి బట్టను గట్ట బాగుగాను

తే॥ లేరు లేరయ్య లేరయ్య వేరు దిక్కు
అండవంచును తెలియని అల్పులకును
చెప్పి ఫలమేమి లేదయ్య చింతదీర్చ
చిత్తగించుము నా మొర శ్రీనివాస

సీ॥ నెలసరినెవ్వండు నెలతలకిచ్చెను
సృష్టిలేదది లేక జగతియందు
అంగపు స్తంభనన్ అలవరచెనెవండు
అదిలేక సృష్టేది అవనియందు
కామవాంఛనెవండు కల్పించు జంటకు
కలుపసృష్టిని చేయు కార్యమందు
చనుబాలనెవ్వండు సతులకిప్పించెను
పాపకడుపు నిండి బట్టకట్ట

తే॥ ప్రకృతి అనుచుండు నాస్తికవాది ఒకడు
ప్రకృతి సృజియించు వాడపు పరమ గతిని
పేరు ఏదైన నీమాయె పెద్ద నీవె
చిత్తగించుము దీనిని శ్రీనివాస

సీ॥ కెంపుల బోలిన సొంపగు అధరాలు
ముత్యాల దంతాల ముగ్ధసీత
వజ్ర సంకల్పుండు బలశాలి రామండు
పగడాల మోవితో వనిత తాకె
మరకత హారాల మాటుచేయొణకెను
ఇంద్రనీలద్యుతిన్ ఇతడు నవ్వె
గోమేధికపుటుంగరము తొడిగెను పతి
వైఢూర్యమాసీత పతికి తొడిగె

తే॥ పుష్యరాగాలదండలు పూనిమార్చ
చెలులు నవ్విరి మురియుచు చెంతచేరి
కనుల మెరసిన దృశ్యంబు కాంచితేను
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ సౌమిత్రి ఆనాడు  సహజన్ముడైనాడు

శత్రుఘ్నుడాతని జతగ బుట్టె

భరతుడు తమ్ముడై చరియించె నీతోనె

గుహుడు సోదరునిగ కూడె నిన్ను

సుగ్రీవుడైనాడు సోదరతుల్యుండు

చిరజీవి హనుమను చెప్పవలెనె

ఆ విభీషణుడట్లె అలరారె భ్రాతయై

శాంతమ్మ సోదరి సహజముగనే

తే॥ వారు చేసిన పుణ్యపు భాగ్యమేమొ

నీతొ నడిచిరి నాకట్టి గతియు కలదె

నాదు తలపున సతతము ఒదుగుమయ్య

చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ అవసరానికి వచ్చి ఆదుకోలేనట్టి
అన్నదమ్ముళ్ళేమి అవసరంబు
మంచి చెడ్డలు చూచి మందులిప్పించని
కొడుకులెందరునున్న కలదె మేలు
చల్లంగ మాట్లాడి చక్కగ కలవని
అల్లుడుండగనేమి అవనియందు
దరిచేరి నవ్వుచు తాతని పిలువని
మనుమలుండిన యేమి మానవులకు

తే॥ తండ్రి రూపాలె వారంత ధరణిలోన
ప్రేమ చూపించి మనిషికి ప్రియమునీక
పైకి పోయాక చేసియు బేధమేమి
చిత్తగించుము నీ వైన శ్రీనివాస

సీ॥ కంటినుండి మనిషి కార్చేది పుసులనే
కుదిరిచెవుల యందు గుబిలి దొరకు
నోటినుండియె కారు ధాటిగ సొల్లది
ఒళ్ళు చెమటకంపు వెళ్ళగక్కు
అందమైనది నాభి అందించు కంపును
మూత్రమెంతటి గబ్బు ముక్కులడగు
మలము వెలువరించు మార్గమే ఘోరము
జననేంద్రియపు కంపు జనులకెరుకె

ఆ॥ కాని మనిషి వీని కనినంత మురియును
వద్దనినిన గాని వదలడేల
ఏమివింత దానినెంచిన పరమాత్మ
చిత్తగించువయ్య శ్రీనివాస

సీ॥ భూమి భ్రమణమగు పూర్తగు ఇరువది

నాలుగు గంటల కాలమందు

ఇంత భూగోళంబు ఏనాడు మానక

సూర్యుని ఏడాది జుట్టివచ్చు

గ్రహములేనాడైన గతితప్పి భూమిని

గ్రుద్దవు నాశమౌ ఘోరముగను

ఉల్కలు ఏనాడు పల్కరింపుకు రావు

ధరణిని, ఆపగ తరమె మాకు

తే॥ వేల తారలు భూమిపై రాలవేల

ఇన్ని గోళాలు కూడిన  ఈ ఖగోళ

మొక్కటే చాలు నిను నమ్మ నిక్కమయ్య

చిత్తగించుము నన్నిటు శ్రీనివాస

సీ॥ పొదగనేర్వనిదైన పుడమిని కోకిల
కమ్మగా కూయును కాననైన
ఎగరనేర్వనిదైన ఇంపుగా పురివిప్పి
నెమలి యాడుచు కళ్ళనెనరు పెంచు
బలశాలికాకున్న చిలకమ్మ ముద్దుగా
పలుకుచు మనసును బలిమి దోచు
పురుగులు తినునట్టి పుంజులు కూయుచు
కాలగమనంబును తెలుపగలదు

తే॥ హీనమైనవి సృష్టిలో లేనె లేదు
ఒకటి లేకున్న ఘనత వేరొకటి ఇచ్చు
అంతయును నీదు లీలయే అందుదయ్య
చిత్తగించుము నామొర శ్రీనివాస

సీ॥ బావులనీరము ప్రజలకు ఆనాడు
దప్పిక తీర్చెను ధరణియందు
చెరువుల నీరము చేకొని ఆవూరి
అవసరాలను తీర్చు అవని యందు
నదుల నీరంబెల్ల నాణ్యతతో దేశ
జనుల ప్రాణంబగు చక్కగాను
సాగర జలములే చక్కగా ఆవిరై
పుడమిపై వర్షించి బ్రోచు మమ్ము.

తే॥ కాని, సంద్రము చెలియలి కట్ట దాటి
రాదు, ఏనాడు వచ్చిన లేదుదారి
దిక్కు నీవొక్కడివె నాడు తెలియగలరె
చిత్తగించుము ఓ దేవ శ్రీనివాస

సీ॥ తండ్రిచే బాల్యాన  తన్నులు తినుశిక్ష

తల్లి తనను దిట్ట తగని శిక్ష

భార్య ఎగ్గులు చేయ బాధించు శిక్షయౌ

కొడుకు దొంగగుటయే ఘోరశిక్ష

కూతురు వ్యభిచారి గొప్ప శిక్షదికాదె

కుల బహిష్కరణయే ఇలను శిక్ష

పూజ చేసిన వారు పూని నిందించుటే

మనిషి ఓర్వగలేని మలిన శిక్ష

తే॥ ఎవరికే శిక్షనిత్తువో ఎవరికెరుక

ఎపుడు మొదలౌనొ ఆ శిక్ష ఎరుగలేక

ఎపుడు  అంతమౌనొ అదియు ఎరుగరాదు

చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ మంచివాడొకడున్న మారునదేముంది

మానవలోకాన మాన్యమగునె

చెడ్డవాడొకడున్న చెడునదేమున్నది

భూమి భ్రమణమాగబోదు సుమ్మి

గొప్ప వాడొకడున్న కూడునదేముంది

చిత్ర పటము పెట్టి జేజే పలుక

చెడ్డ వాడనిచెప్పి ఛీయనిపించినన్

మంచివారుందురు మచ్చలేక

తే॥ మంచి వానిగ తోపించి మాయచేసి

లోన విషమున్న వారితో మనగనగునె

నీకు మాత్రమె అదికూడు నీలవర్ణ

చిత్తగించుము దీనుల శ్రీనివాస

సీ॥ హీనంబుగాదిట్లె ఎక్కడ గలవని
ఆ హిరణ్యకశిపుడడిగినాడు
హేయంబుగా బల్కె హీనరావణుడట్లె
నీ భార్య చెరబట్టి నీచుడయ్యె
నీచంబుగాదూరె నిను నాడు కంసుడు
చంప దనుజులంపి చచ్చెతానె
నూరుతిట్లు వరకు వరము పొందగ తల్లి
నిను తిట్టి శిశుపాలుడణగె తానె

తే॥ తిట్లక్రుంగవు, పొంగుల దేలవయ్య
పూజలందిన, తెలియక బుద్ధిలేక
కోపతాపాలు నీపైన చూప నగునె
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ ధర్మరక్షణజేయ ధరణివామనుడయి

చేజాపి బలికడ చేరినావు

ధర్మరక్షణజేయ ధరణి భార్గవుడయి

తలగొట్టి రాజుల తరిమినావు

ధర్మరక్షణజేయ ధరణి శ్రీరాముడయి

భార్యతోడును వీడి బ్రతికినావు

ధర్మరక్షణజేయ ధరణి శ్రీకృష్ణుడై

హితబోధ గీతను ఇచ్చినావు.

ఆ॥ ధర్మ రక్షకొఱకు తనువులు మార్చావు

ధర్మ స్థాపనంబు ధరణిజేయ

జన్మలెత్తినావు జనులను కాచావు

చిత్తగించు మొరలు శ్రీనివాస

సీ॥ ఆటల నొక్కండు అగ్ర గణ్యుండౌను
పాటల ఖ్యాతిని బడయు నొకతె
వేలాది శిశువుల వెజ్జుయౌ ఒక చాన
చిత్రలేఖనమున సిద్ధుడొకడు
ఇండ్లను కట్టించి ఎనయు కీర్తి నొకండు
నటియించి పేరొందు నాతియొకతె
వంటలు చేయుచు వాసిగను నొకండు
రచయిత్రి గానయ్యె రమణి యొకతె

ఆ॥ అట్లు చేసికూడ అందరు కీర్తిని
అందరేల శ్రమల అలసి కూడ
నీదు కరుణ లేక నెగడునే ఏదైన
చిత్తగించవయ్య శ్రీనివాస

సీ॥ ఆటలన్నియునాడి అపజయంబొకడందు

పాటల ఖ్యాతిని బడయదొకతె

శిశువుల జంపెడి శ్రేష్టుడొ ఒకవెజ్జు

చిత్రకారుడొకండు చెత్త బెంచు

ఇండ్లు కూలగ కట్టు ఇతగాడు యమరాజు

నటిగాక నాతిఒకతె అమ్ముడొ

వంటలొకడు చేయ వాంతులొ రుచిలే

రచయిత్రి కాబోదు రమణి యొకతె

తే॥ ఒకరు పేరొంద ఒక్కరు ఓడిపోవ

ఏది కారణమీయది ఎవ్వడెరుగు

నీదు పదములు పట్టిన నేనెఘనుడ

చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ ఆకలి కడుపుకు అన్నమెవ్వండిచ్చె
నోరెండ త్రాగను నీర మిచ్చె
బిడ్డ అడ్డంబైన 'అడ్డంబెవండయ్యె'
అంధుల కాచేటి అన్నయెవడు
ఇంటిదారెవ్వడు ఎరిగించె గొడ్లకు
బావిలో కప్పకు బంధువెవడు
పూతేనెలెవ్వడు పూనితుమ్మెదకిచ్చె
రంగుల హరివింటి రచయితెవడు

తే॥ ఎదుట కనబడు ప్రకృతే ఈశ్వరుండు
ఎదుటకనలేని దేవుని ఏల వెతక
ప్రకృతి సృష్టించు పరమాత్మె ప్రకృతిగలడు
చిత్తగించుము ఓ దేవ శ్రీనివాస

సీ॥ కోటీశ్వరుకుసంతు కొరివి బెట్టనులేడు

యజ్ఞాలు యాగాలనన్ని జేసి

కూటికి లేనోణ్ణి కూడె గంపెడుమంది

రెక్కాడితే గాని డొక్కనడదు

అపర శ్రీదేవికి అక్కమొగుడు గతి

అందరు ఛీ కొట్టి ఆడిపోయ

నవ్వుల జల్లుల నటునికి ఇంటిలో

కన్నీటి మరణమేగతగు తనకు

తే॥ ఎవరికేరీతి జరుగునో ఎవరికెరుక

నీదు దయ లేక రాజైన బీదయగును

నీవు తలచిన ఏలును నిఖిల జగతి

చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ ప్రతి వసంతమునందు పల్లవించును చెట్లు

పూలతో శోభించు పుడమియంత

ఎండలు గ్రీష్మాన మండించు శోషించు

వర్ష ఋతువులోన వానలొచ్చు

శరదృతువొచ్చిన చక్కగా రాత్రులన్

వెన్నెల మురిపించు ప్రేమికులను

హేమంత ఋతువున హిమము కురియు బాగ

చలితోను వణికించు జనులనెల్ల

తే॥ శిశిర ఋతువున ఆకుల జెట్లు రాల్చు

యుగము లెన్నైన ఋతువుల ప్రగతి పోదు

దీనికెవ్వరు బాధ్యులౌ తెలియునీకె

చిత్తగించుము ఓ దేవ శ్రీనివాస

సీ॥ మధుర గాయకునికి మాలిమి కొడుకైన
వాని గొంతు వినిన వాంతులగును
జ్యోతిషరత్నకు సొగసరి కొడుకౌను
తిధివారములు రాని అధముడిలను
కోట్లకు పడగెత్తు కులశేఖరుని పుత్రు
డయ్యె లెక్కలు రాని అర్భకుండు
వైద్యశ్రేష్టుని బిడ్డ వెనక దారిన కూడ
వైద్యుడు కాలేడు వింత కాదె

తే॥ గొప్ప రచయితకిని బుట్టె కోర్కెలణగ
అక్షరాలైన రానట్టి అర్భకుండు
ఎవరి కర్మల ఫలములు ఎవరి కెరుక
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ ధర్మజుడానాడు తలవంచి సహియించె
పాచికలతొ గొట్టు పాపి యొకడు
భీముడు వంటల విరటుని కొలిచెను
పార్థుడు  పేడియై బ్రతికెనచట
నకులుడు గుర్రాల సాకెను, గోశాల
సహదేవుడావుల చాటునుండె
ద్రౌపదివసియించె తల సుధేష్ణకు దువ్వి
మానవతయ్యును మదిరదెచ్చె

ఆ॥ బావ వారికెవరు పరమాత్మ నీవయ్య
ఆమె నిన్ను అన్నవనుచు గొల్చె
కర్మఫలము పోదు ఘనులెవ్వరికినైన
చిత్తగించవయ్య శ్రీనివాస

సీ॥ 'అమ్మ' ని పిలుపులో ఆనందముకు కాదె
ప్రసవవేదన కోర్చు పడతులంత
అతివ పొందుననున్న ఆనందముకు కాదె
సంసారమును ఈడ్చు "సగటుమనిషి"
అవని కీర్తిచ్చెడి ఆనందముకు కాదె
తొడకోసి పంచిచ్చె తొల్లి 'శిబియు'
అన్ని రాజ్యాలేలు ఆనందముకు కాదె
నేటికిన్ యుద్ధాల నీతిలేదు

తే॥ అంతమాటాడపనిలేదు అయ్యనిజము
వినుము నీపొందు ఆనందమునకు కాదె
"పిచ్చి వ్రాతల" నిన్నునే వేడుచుంటి
చిత్తగించుము ఓప్రభూ శ్రీనివాస

సీ॥ బాలురు నిను పొందె పడతులు నినుపొందె
దొంగలు నిను పొందె తోయజాక్ష
రాజులు నిను పొందె రసికులున్ నిను పొందె
దేవతల్ నిను పొందె తెలియ నిజము
జూదరుల్ నిను పొందె జొచ్చి హంతకులొందె
బ్రాహ్మణోత్తములొందె బాగుగాను
మౌనులు నిను పొందె మాయగాండ్లును పొందె
రోగాలనేడ్చెడి రోగులొందె

ఆ ॥వీరు వారలనుచు బేధమ్ములేకయే
వసుధ పొంది రెల్ల వాసుదేవ
నేను తక్కువేమి నినుబట్టి వదలను
చిత్తగించవయ్య శ్రీనివాస

సీ ॥ సేవయేకాదది చేరక నీచెంత
పూజయే కాదునిన్ పొగడకుండ
భాషయేకాదది వ్రాయక నీమీద
కొలువుకాదది నిన్ను కొలువకుండ
రచన కాదది నిన్ను రక్తితో చదవక
పాటకాదది నిన్ను పాడకున్న
వస్త్రంబు కాదది బాగ నిన్ గప్పక
ధనము కాదది నీకు దక్షిణిడక

తే॥ నీవు ఇచ్చిన ఘనతలే ఏవి అయిన
నీవు ఇచ్చిన సంపదె నిఖిలమెల్ల
మనిషి మనుగడే లేదు నీ మహిమగాక
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ కువలయాపీడంబు గూల్చినదెవ్వడు
కుబ్జకు సొగసును కూర్చెనెవడు
చాణూరమల్లుని చంపినదెవ్వరు
అక్రూరు కెవ్వడు అయ్యె రక్ష
సాందీపు బిడ్డను జగతి తెచ్చెనెవండు
కంసుని జంపిన ఘనుడు ఎవరు
బలరాము తమ్ముడై పరగినదెవ్వరు
కుంతీసుతుల రక్షకూర్చెనెవడు

తే॥ పాపులై నట్టి దనుజుల బలిమి జంపి
పిడికెడటుకులు తిని సిరుల్ పేర్మినిచ్చు
నిన్ను ఎంతని పొగడను నీలవర్ణ
చిత్తగించుము ఓ దేవ శ్రీనివాస

సీ॥ అప్పు చేయగరాదు అని చెప్పనై నీవు
వడ్డిగుంజెదవయ్య నడ్డివిరగ
ఆలివీడగరాదు అనిచెప్పనైనీవు
మౌనమూర్తిగ బాధమనితివయ్య
నమ్మిన విడరాదు నష్టాలు ఎన్నైన
అనితెల్ప చూపావు అభయముద్ర
ఆపదన్ మొక్కుచు ఆపైనమరచిన
కాలితో తంతావు గదుముతావు

తే॥ శరణు శరణయ్య శరణయ్య శరణు దేవ
అలిగి శిక్షించ మేమెంత అల్పులమయ
నీదు బిడ్డను తన్నిన నీకునయమె
చిత్తగించుము ఓప్రభూ శ్రీనివాస

సీ॥ అడవిలో పులి జంప ఆ వేటగానికి
దహనసంస్కారమేదాత జేయు
కానల పులి చావ కనుగొని పూనుచు
ఖననమెవ్వడు జేయు ఘనముగాను
దానిని ఆబగా తినెడి రాబందును
పూనిపూడ్చు నెవండు పుణ్యమొంద
దానిని తిను చిన్న ప్రాణులు చచ్చిన
ఖనన సంస్కారము గరపునెవడు

తే॥ అన్ని చేసెడి వాడవు అవని నీవె
తండ్రి అందరికౌదువు తగుచు నీవె
ఖనన కర్తవు నీవయ్య కరుణ రూప
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ అద్భుతమైనట్టి యంత్రాల కనిపెట్టి
అందించు వారంత అధిపనీవె
అంతందరాకుండ అడయించు రోగాలు
అడయంచు వైద్యుడే అధిపనీవు
మరణించు వానినిన్ మగత నిద్రను తేల్చు
మధుర గాయకులంత మహిని నీవె
ఆకలి కేడ్చిన అన్నంబు పెట్టెడి
దయశాలియే నీవు ధరణి యందు

తే॥ మనిషిలో చేరి చేయించు మాన్యుడీవె
వసుధ మనిషి ద్విపాదాల పశువుకాదె
నీవు చేసిన మన్ననే నేడు మాకు
చిత్తగించుము ఓ దేవ శ్రీనివాస

సీ॥ కొండచరియ జారి కూలిన వేళల
చేతులెత్తక ఏమి చేయగలము
వసుధయే కంపించి ప్రళయంబు వచ్చిన
మనిషి చేయునదేమి మడియు గాని
జీవ నదియనుచు చేయెత్తి కొల్చెడి
గంగమ్మ పొంగిన కంటినీరె
సాగర మందున సాగిన ఉప్పెన
దిక్కెవ్వరౌదురు దీనులకును

తే॥ మంచు రాలిన అడవిలో మంట లెగియ
వాన కురిసిన గడగడ వణకు దక్క
మాకు సాధ్యమే ఎదిరించ మాటలేల
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ చెరకుగడనెవండు చేసెను తీపిగా
వేపకు నెవ్వండు బెట్టె చేదు
సాగర జలముల దాగిన ఉప్పును
బయటకు తెచ్చెను వసుధ నెవడు
చిన చిన్న మిరియాలు చిందులు వేయించు
కారము దానికి కట్టె నెవడు
పచ్చికాయకెవండు వగరును పెట్టించె
చింతకాయ పులుపు చేసెనెవడు

తే॥ ఆరు రుచులను తెలుపగ వేరు పరచి
నాల్క చేసెడి చిత్రమే నళిననాభ
అట్టి నాలుకే మాటలనన్ని పలికె
చిత్తగించుము ఈ వింత శ్రీనివాస

సీ॥ జన్మనిచ్చిన తల్లి జగతినే దైవంబు
పెంచిన తల్లియు వేరుకాదు
భార్యను గన్నట్టి పడతియు తల్లియే
గురుపత్ని మాతయె నరులకెల్ల
సహజన్ముడౌ అన్న సతియును జనులకు
వదినయే కాదు ఆవనిత 'అమ్మ'
జన్మనీయకనైన జగతి 'ఇంకోమ్మ' లే
భక్తికొలువ వలెన్ పాదములను

ఆ॥ తల్లిఋణము దీర్చు తనయుని తీరుగా
ఋణముదీర్చవలెను జనులు భువిని
కర్మచేయవచ్చు కన్నతల్లికి వోలె
చిత్తగించవయ్యా శ్రీనివాస

సీ॥ నిన్నువీడుటకన్న నెలకొను బాధేది
ఓ జగన్నాథుడా నిజము నిజము
నీ పొందుకన్నను నిధియుధనంబేది
ఓ జగదాధార నిజము నిజము
నిను మరచుట కన్న ఘన నష్టమున్నదే
ఓ జగదీశ్వరా నిజము నిజము
నీ ధ్యాసకన్నను నిశ్చల సుఖమేది
ఓ జగద్రక్షకా నిజము నిజము

తే॥ ఇన్ని తెలిసియు నీ మాయ కన్ను గప్ప
సుఖము దు:ఖము రీతిగా చూచి తలచి
దు:ఖమే సుఖమనిపించు తోయజాక్ష
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ మాట నిలుపుకొన మహిలోన నీ సాటి
వెతికినా లేరయ్య గతివినీవె
ఆ యశోదమ్మకు ఆనాడు మాటిచ్చి
వకుళగా జన్మించ వసుధ చేరి
చక్కగా పుత్రుడై జరిపింప చేశావు
శ్రీనివాసుని పెళ్ళి కనులు పండ
కష్టనష్టాలను కన్నీళ్ళ సైతము
భక్తుల మాటకై పనిగదాల్చు

ఆ॥ నీకు సాటియెవరు నిఖిల జగంబున
కాకపోతె ఇచట కలదు మెలిక
వీడరాదు పదము వేదనలెదురైన
చిత్తగించవయ్య శ్రీనివాస

సీ॥ శేషుడు తమ్ముడై సేవించ ఆనాడు
రాముడై సతితోడ రాజ్యమేలి
తమ్ముడై బలరాము ధన్యత కొల్చిన
వసుదేవ సుతునకు వందనములు
చెంగు చించుచు కట్టు అంగన ద్రౌపది
మానము కాపాడె మాధవుండు
ముక్కిన అటుకుల ముడుపుకు సిరులిచ్చె
నాడు కుచేలుకు నగధరుండు

తే॥ శరణు వేడిన ప్రార్థించి చక్కగాను
నేడు సాయియై జీససై నిఖిల జగతి
ధర్మ మార్గాన నడుపనై తలచినావు
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ తన పట్టువీడక తరుణి ఆ కైకమ్మ
భర్తనే జంపెను వరములడిగి
తనపట్టు వీడక దానవసోదరి
కులమెల్ల చెరిచెను కూల్చిలంక
తనపట్టు వీడక తరుణి ఆ సీతమ్మ
పైడిలేడిని కోరి వెతలు పొందె
తనపట్టు వీడక తరుణి ఆ శ్రీలక్ష్మి
వైకుంఠమే వీడ విభుడు వగచె

తే॥ తరుణులిదివిని నేటికీ మరువరాదు
పట్టుదల కన్నముఖ్యము ప్రాణమగును
బొంది పోయాక ఏడ్చినా పొందగలమె
చిత్తగించుము ఓ స్వామి శ్రీనివాస

సీ॥ శృంగార రసమది సరసంబు హృద్యము
హాస్యమౌ మోదంబు అందరికిని
కరుణరసంబది కరగించు హృదయాలు
రౌద్రము కోపమున్ రగుల జేయు
వీరము కలిగించు వీరభావంబులన్
భీభత్సమిచ్చును వెగటుదనము
ఆ భయానక మెంతొ అణగించు ధైర్యము
అద్భుతమిచ్చును అచ్చెరువును

తే॥ శాంతమును చిందు మనముల శాంత రసము
నవరసాలన్న ఏవియో నరులకెల్ల
తెలియగా చెప్పినాడను దేవదేవ
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ వడ్లను దంచగా వచ్చు పై పొరపోయి
తెల్లని బియ్యము తినగ బలము
గోధుమల్ మనిషికి గొప్పగ తిండయ్యె
ఉలవలు పుష్టికి ఉన్నతములు
అనుములు మిట్టలో ఒనగూడె ధాన్యమై
నువ్వులు శ్రేష్ఠమౌ నూనె నిచ్చె
కందులు పెసలును ఘనమైన పప్పులు
మినుములు ధాతువున్ మించి ఇచ్చు

తే॥ శనగపప్పును చిరుతిండి మనిషి చేసె
ఇవియె నవధాన్యములు యంచు ఇట్లు తెలియ
చెప్పినాడను నీదయన్ శేషశయన
చిత్తగించుము నా మొర శ్రీనివాస

సీ॥ మామ్మలమ్మమ్మలు మాలిమి చేతురు
అత్తలు పిన్నులు అలరించు గారాన
అమ్మ స్తన్యము చేత అమరించె జీవంబు
అక్కచెళ్ళెళ్ళతో ఆటపాట
ఆలి జెప్పగనేల అర్ధాంగి ఆమెయే
మరదళ్ళు వదినలు సరసమాడు
పుత్రికగానిచ్చు పులకింత మరువడు
కోడలై పెంచును గోత్రమెల్ల

తే॥ మనుమరాలిగ పెద్దలే మహికి వచ్చి
ముద్దుమురిపాల నిత్తురు ముందుగొనిన
మనిషి మనుగడ ఈ రీతి మారుచుండు
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ అందాల భరిణకు అమరించుతావయ్య
బహుకురూపిని యెంచి భర్తలాగ
సుగుణాల ప్రోవని జగతిమెచ్చెడివాని
కంటగట్టెదవేల అల్పచరిత
అద్భుతవైణికు అనురాగ పుత్రుండు
వీణ వాయించిన వినగలేరు
దానకర్ణుండని తలచిన వానికి
చెప్పులు కాజేయు బెనటి కొడుకు

తే॥ జోడి కట్టుట యన నిన్ను చూసిగాని
నేర్వలేరయ్య నీ సాటి నీకు నీవె
'యాడనేర్చితి' ఓ అయ్య యదుకులేశ
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ వెన్నల దొంగని వెర్రి వారందురు

వెన్నతో పనియేమి వేద్యునకును

కన్నెల దొంగని కాని వారందురు

కన్నెల పనియేమి కాంతునకును

గారడీ వాడని కవ్వింతురే నిన్ను

కనులెఱ్రచేసిన కలదె జగము

భజనకు ఉబ్బెడి వాడని తలతురు

భజనతో పనియేమి భవ్యునకును

తే॥ వెర్రి ఊహల నిను గట్ట వీలుగాదు

భక్తి భక్తియే భక్తియే వలయునయ్య

దాని నాకివ్వలేదేమి దరణినాథ

చిత్తగించుము నామొర శ్రీనివాస

సీ॥ దేహమే లేనట్టి దివ్యాత్మగానెంచి

మొక్కుదురే నీకు ముక్తి కొరకు

నాల్గుమోములు గల నలువగా భావించి

తపములు చేసిరే దానవులును

ముక్కంటిగానెంచి మొక్కిరే పలువురు

కంకాళములు దాల్చు ఘనుడవంచు

ఆదిపరాశక్తి అమ్మగా భావించి

బలులను ఇత్తురే భయముతోడ

తే॥ నిన్ను ఏ రీతి కొలిచినా సన్నుతించి

భేదమేముంది మాటలు వేరుగాని

సర్వమును నీవె తండ్రివి జగతికంత

చిత్తగించుము నా మొర శ్రీనివాస

సీ॥ జింక కాల్విరిగిన చేరికట్టు నెవండు
ఎలుగులకెవ్వండు ఇచ్చుమందు
'కరి' ని కాపాడె మకరి నుండి ఎవ్వడు
ఎగిరెడి పిట్టలనెవడు కాచె
పెను తిమింగలముకు వైద్యమెవ్వడు చేయు
నల్లికి బల్లికి నాధుడెవడు
మిడతను రక్షించు మేటివాడెవ్వడు
పాము పిల్లల చావు బారికాచు

తే॥ చిరుతపులి కూననెవ్వడు చేరి బ్రోచు
పేడపురుగుల కాపాడు పెద్ద ఎవడు
నీవు గాకున్న ఎవరయ్య నిఖిల జగతి
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ అడవి జాతి స్త్రీకి అమ్మయై కాన్పును
దరిచేరి జరుపును ధరణినెవరు
విపరీతమైనట్టి వేదనన్ స్మృహతప్ప
స్మృతినిచ్చు నెవ్వడు బ్రతుక మరల
భూకంపమందున భూ శిధిలాలలో
పసిబిడ్డకెవ్వడు ప్రాణదాత
రోదసి చీల్చుచు రోజులు పయనించు
వ్యోమగామెట్లొచ్చు భువికి తిరిగి

తే॥ కాచు ఉప్పెనలందున ఘనుడెవండు
వారలెవరైన కానిమ్ము వసుధయందు
నీకు ప్రతిరూపులే స్వామి, నీవె వారు
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ పసిపాప నడకకై పడిలేచుపలుమార్లు
ఎముకలు విరుగునా ఎన్నడైన
అంతరిక్షమ్మున అన్ని గోళములుండు
ఒనర భూమిని తాక దొక్కటయిన
ఎన్ని వత్సరములు ఈడేరినాగాని
రేబగళ్లను మార్పులేకయుండె
జంతువులకు గల్గు చక్కని గ్రాహ్యత
మనిషికి లేదేల మాయకాదె

తే॥ తెలియ సాధ్యము కాదయ్య దేవ దేవ
నింగి చూచిన నడిరేయి నీదు వునికి
స్పష్టమౌకాదె రక్షవు జగతికంచు
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ పై చదువుల కోరి వివిధ దేశాలేగు
చదువుల పేరొందు సాటిలేక
ఉన్నతోద్యోగాన ఊపిరి సలపక
తనవారి సైతము తలపబోడు
బిరుదులు పొందును పేరొందు రాజ్యాల
తనపేర సంస్థల తగుచు నిలుపు
పెద్ద ప్రేలుడు వల్ల పుట్టెనీ జగమంచు
హేతు వాదులు గాక హీనులనును

తే॥ ఏళ్లు గడచును రోగాలు ఎక్కువగును
చావు భయమెక్కు నడచుట సాధ్యమవదు
అపుడు నిను కోరిగొణిగినా అర్థమవదు
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ రావణుడే గాను రాత్రి వేళల వచ్చి
కపిసేన జంపడు కదనమందు
బ్రహ్మాస్త్రముండియు రామచంద్రుడు నాడు
మతితప్పివాడడు మట్టుబెట్ట
పాశుపతంబుండి పార్థుడు అనిలోన
దుర్యోధనుని జంప తోడు పడడు
విలువిద్య నేర్పిన వెర్రి ద్రోణుండట్లె
ధర్మజుమాటతో తరలె దివికి

తే॥ ధర్మ యుద్ధము చేసిరి దానవులును
యుద్ధమొక్కటె యున్నది యుర్వియందు
ధర్మమే లేదు వెదికినా తరచి తరచి
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ పాట సర్వస్వంబు పాపాయికానాడు
జోలతో మురియును జోగు నిద్ర
ఆటల సొక్కును ఆ పైన బాలుడై
అమ్మమాట మరచు ఆటలందు
వేటాడు యువతుల వెర్రితో జీవించు
అందరి మరచును అతివచేరి
మాటల మురియును, మరగును భార్యను
తన బిడ్డలను సాక తపనచెందు

తే॥ ధనము, మేడల, వాహన తపన చెందు
వ్యాధి, మందుల చింతతో బ్రతుకుచుండు
ఒక్క క్షణమైన నిను జేర ఒల్లడయ్య
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ మనిషి జీవితమంత తనబాగు కోసమె
జీవించు కడదాక చింతతోనె
అమ్మ గర్భమునందు ఆహారమును పీల్చి
తొమ్మిది నెలలుండు తోడు లేక
వీడును గర్భము వడిజేరి స్తన్యము
పీల్చి పాలను త్రాగి పిప్పిచేయు
వడివీడి చేతుల వరసగా మారును
పాకగ వీడితా బయటజేరు

తే॥ బయట కొచ్చేక వడివడి బడయుచుండు
అనుభవమ్మును దినదినంబట్లె పెరుగు
పెరిగి జీవన సంగ్రాన విడచు నిన్ను
చిత్తగించుము ఈ వింత శ్రీనివాస

సీ॥ విడిచిన వస్త్రాలు పుడమిని దేహాలు
వగచుట చావుకై తగదనంచు
దేహము నశియించు, దివిజేరినా కాని
ఆత్మశాశ్వత మని అంటివయ్య
రాకపోకలు చేసి రంజిల్లు జీవాత్మ
దివికి భువికి మధ్య తెలియమనుచు
కర్తవ్యమందున ఘనులు చావుకు నైన
బాధపడరనంచు బోధచేసి

తే॥ విజయసారథివై, నాడు విశదపరచి
గీత బోధించి అనిజేయ క్రీడిచేత
ధర్మసంరక్ష జేసిన దాతవీవె
చిత్తగించుము ఓ స్వామి శ్రీనివాస

సీ॥ గుండె వ్యాధులతోటి కుఱ్ఱ వాళ్ళను జంప
కోదండమునకేమి గొప్పస్వామి
బలహీనులనుజేసి బక్కవారిదునుమ
నీ సుదర్శనముకే నీతి స్వామి
నిస్సహాయుల జేసి నిరపరాధుల గూల్చ
నందకమునకును న్యాయమయ్య
తల్లిదండ్రులు లేని పిల్లగాండ్లను గొట్ట
కౌమోదకంబుకే కాని పనగు

తే॥ ఆయుధాలవి కావలె అసురులకును
నేడు మాబోటి వారిని నిలువరించ
నీవు భృకుటిని ముడిచిన నిలువగలరె
చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ అసురుని కొడుకును అతనిపై ఉసిగొల్పి
శాంతి దూరము చేసి చంపినావు
దానమిచ్చిన వాని తలదొక్కినావయ్య
గొడ్డలిన్ రాజుల గొట్టినావు
చెట్టు చాటున కోతి గొట్టినావేమయ్య
అసుర భ్రాతకు రాజ్యమొసగినావు
పరులింటి చెట్టును భార్యను నవ్వించ
దొరలాగ దాడెల్లి దోచినావు

తే॥ ఆలు బిడ్డలనొదలితివర్ధరాత్రి
అప్పు చేశావు పెండ్లిలో గొప్ప కొరకు
నీవు నేర్పిన విద్యలే నీరజాక్ష
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ ఎగతాళి అన్నదే ఇల హేతువైనది
భారతంబు భువిని పాదమిడగ
ఎగతాళి అన్నదే ఇలహేతువైనది
రామాయణంబిలన్ రాజ్యమేల
ఎగతాళి అన్నదే ఇలహేతువైనది
భాగవతముబుట్ట భక్తి చేత
ఎగతాళి అన్నదే ఇలహేతువైనది
చణకుడు పగతోటి చరితచెంచ

తే॥ ఏల ఎగతాళి చేయుట హితవు కాదు
ఏల కక్షలు పెంచుట మేలు కాదు
ఏల చరితలు నేర్పవు మేలు నడత
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ ఒక కంటకన్నీరు ఒక కంట పన్నీరు

ఒలికించనేలయ్య వలదు వలదు

ఒకరోజు కడగండ్లు, ఒకరోజు కనకంబు

వలదన్న నిత్తువుఏల ఏల

ఒక చోట సన్మాన మొకచోట అవమాన

మేలయ్య  అట్లీయ మేలుకాదు

ఒకడికి తినలేదు, ఒకడికి తినరాదు

అందరి నేడ్పింతువదియె ఆట

తే॥ సరియె మా కర్మఫలదాతవరయ నీవు

కోతి వంటియీ మనసేల కూర్చినావు

ఆడుకుందువు అదియిచ్చి అవనిలోన

చిత్తగించుము మా మొర శ్రీనివాస

సీ॥ కల్లయౌ తలిదండ్రి కల్లయౌ తోబుట్లు
కల్లయౌదారయున్ కల్ల కల్ల
కల్లయౌ పుత్రులు కల్లయౌ పౌత్రులు
కల్లయౌ మిత్రులు కల్ల కల్ల
కల్లయౌ భాగ్యాలు కల్లయౌ భోగాలు
కల్లయౌ భవనాలు కల్ల కల్ల
కల్లయౌ జన్మయు కల్లయౌ రోగాలు
కల్లయౌ చావులు కల్ల కల్ల

ఆ॥ కల్లగాక మమ్ము ఎల్లవేళల కాచు
నల్లనయ్యనీవె చెల్లునంచు
తల్లడిల్ల తేటతెల్లమయ్యెను ప్రభూ
చిత్తగించు దేవ శ్రీనివాస

సీ॥ యమరాజు పంపించ అవనికి వచ్చిన
వానిభటుడొకండు వణికిపోయె
సోమయాజిని చుట్టె సుందరి యొక్కతె
వారి నడుమ జేరె వారవనిత
వ్యాపారదక్షుడు పడె బేస్తపదముల
సుగుణాల భరిణను చుట్టె నటుడు
గాయకుడును దూరె కౌగిట నెరజాణ
విద్యార్థినిని జుట్టె వెజ్జు యొకడు

తే॥ వీరలందరు చచ్చిరి చేరియొకెడ
జలధి కోపింప క్షణములో అలలవల్ల
కుప్పగా పోగులైనారు కూడిరంత
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ ఒక చేత నివ్వక ఒక చేత పొందడు
పరమాత్మ పెట్టిన పద్ధతిదియె
అన్నంబు నీయక అన్నంబు తిన లేడు
వస్త్రంబులీయక బట్ట రాదు
ఉండ చోటీయక ఉండవు నెలవులు
చదువు చెప్పించక చదువు రాదు
బిడ్డలు కలుగరు పెట్టనివారికి
అభయమీయని వాడు అవును పిరికి

తే॥ మందునిప్పించకున్నచో మారు జన్మ
రోగిగా పుట్టి బ్రతుకును రోగివోలె
చూడ సాధ్యమె నీ మాయ జొక్కి యుండ
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ నాయన చచ్చిన నలుగురు కావాలి
జతకోరు మనిషియె సంఘ జీవి
పిల్ల పెళ్ళికి కూడ పిలుచును చుట్టాల
వడ్డించు వారల వసతిలేక
పెరిగెను వ్యాపార ధోరణి ఈ నాడు
రొంటి యందున రూకలుంటె చాలు
చిన్ని నా పొట్టకు శ్రీరామరక్షని
మనుషులు పెరిగిరి మమతవీడి!

తే॥ నీవు నాకొద్దు నా జోలి నీకదేల
రూకలుండిన దేవుడే నీకు హితుడు
అనుచు ఏకాకి అయినాడు మనిషి నేడు
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ కానికాలమునందు ఘనులచే సైతము

కాని పనులు సల్పు ఘనుడవయ్య

భీమసేనునిచేత విరటుని వంటింట

వంటగరిట ద్రిప్ప బనిపినావు

తకధిమ్మి తకధిమ్మి తానాడె పార్థుడు

మోడుగ భీష్ముడు గడిపె బ్రతుకు

అసహాయ శూరుడు అభిమన్యుడనిలోన

అతి ఘోరముగ నాడు అంతమాయె

ఆ॥ నీవు తలవకున్న నెగడునే ఏదైన

నీవు తలుచుకున్న నిముషమైన

ఆగదంచు తెలియుటదెకదా జ్ఞానము

చిత్తగించవయ్య శ్రీనివాస

సీ॥ ముద్దుల పెంచిన ముదిత యశోదకు
మొగము చూపించవే మొత్తుకొనిన
ముక్కుపచ్చారని మున్ను తోబుట్టులన్
కంసు కత్తికి బలి గరపి నావె
కనరావె ఒకమారు కరుణతో అనియేడ్చు
మునివరేణ్యుల మాట వినవు స్వామి
పదములు కోరుచు పడివేడు వాగ్గేయ
కారుల కరుణించ కష్టమయ్యె

తే॥ నేడు నావంతు, కాలమా గడచి పోయె!
ఆదినే హంసపాదని అన్నతీరు
అవిటితనమొచ్చె బ్రతుకుపై ఆశపోయె
చిత్తగించుము నామొర శ్రీనివాస

సీ॥ తనువిచ్చు తండ్రులు తలకొరివెట్టగా
తరలిపోయెదరయ్య ధనమునిచ్చి
గర్భవాసంబిచ్చు కన్నతల్లులు అట్లె
పిలుపందిపోదురు పైకి తరలి
తోడు చేరినవారు తోబుట్టువులు వీడు
ఈ జన్మకింతని హితవు పల్కి
చదువు చెప్పిన వారు జ్ఞానమిచ్చినవారు
ఒక్కొక్కరే జన్మలో వదలిపోవు

తే॥ మేము ఏడ్చెడి వారలు మింటిజేర
మాకు ఏడ్చెడి వారలు మాకు మిగులు
వీరి భ్రాంతితో నీదయ కోరమెపుడు
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ ఆ హిరణ్యకశిపుడానాడు కోరిన

వరములు వరుసగ జెరిచినావు

పవలు రేయిని కూడ చావరాదన్నచో

అసుర సంధ్యను వాని నణచినావు

ఆయుధమ్మున చావు నందరాదన్నచో

గోళ్ళతోనంతము కూర్చినావు

గృహములోపల బైట గారాదు చావన్న

గడపపై మృత్యువు గరపినావు

తే॥ దేవ దానవ నరులతో చావులేని

వరము కోరంగ దానిని వమ్ము చేయ

నారసింహుడవై మట్టి గరపినావు

చిత్తగించుము ఓ స్వామి శ్రీనివాస

సీ॥ బాలప్రహ్లాదుని పాలింపనానాడు
వెనువెంటనున్నావు వెతలు దీర్చ
కాలకూట విషమ్ము గ్రోలనునీయంగ
కరుణించి విషమును విరిచినావు
పర్వతంబుననుండి పడదోయుచున్నచో
పట్టుకొనుచు బ్రోచినావు వాని వేళను
విషసర్పముల కాటువేయించు తరుణాన
విషమును క్షణములో విరిచినావు

తే॥ ఏనుగులు వానిత్రొక్కినన్ ఏమికాదు
ఇందుగలవందులేవన్న సందియమ్ము
లేని రీతిగ బ్రోచితివానినాడు
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ అదితి కశ్యపులను అలరింప నేర్పుతో
వామనుడిగ నీవు అవతరించి
బలిచక్రవర్తితో పనిగ మూడడుగులు
యాచించ వెడలితివయ్య నీవు
శుక్రుడడ్డుపడగ చొప్పించి పుల్లను
పొడిచిఏకాక్షిగా విడిచి నావు
భువి నింగి రెండయ్యె పూర్తిగ అడుగులు
మూడోది తలపైనె పెడితివయ్య

తే॥ త్రొక్కి పాతాళముకు వాని తోయజాక్ష
వాని కావలి వానిగా మనితివయ్య
అట్టి నీకీర్తి నేటికీ అవని నిండె
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ జమదగ్ని రేణుకల్ చక్కగాతముకన్న
పంటగా నిను పొంద పావనముగ
తల్లిని తలగొట్టి తండ్రిచే వరముగ
బ్రతికించితివి నీవె భళిర బాగు
భూకాంతులందరన్ బుగ్గి చేసితివయ్య
నీతల్లి రోదించ ప్రతినబూని
శ్రీరామునెదిరించి శిరసు వంచితివయ్య
అవతారమానాడె అయినదంచు

తే॥ గురుడవై క్షత్ర విద్యను గరపినావు
భూమిదానము నిడితివి భూసురులకు
పరశురాముడు అనినంత వణికె నృపులు
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ బలిని డాసితివయ్య పట్టినీ జోలెను
కన్నతల్లిని వీడి గడపలోనె
గుహనిడాసితివయ్య కోరి కాల్గడుగంగ
కౌసల్య కన్నీరు కానవేమి
కర్ణునాపితివయ్య గౌరవించుచు వాని
ఆ యశోదను వీడ అగునె నీతి
'తురక' డాసితివయ్య 'దొర' యంచునడిరేయి
రామదాసును వీడి "రామరామ"

ఆ॥ నీవు చేరువారు నికృష్టులైనను
నిన్ను చేరువారు నేతలయ్య
నేను ఎందుబడుదు నీవెదేల్చాలయ్య
చిత్తగించు దేవ శ్రీనివాస

సీ॥ నిజమేదొ తెలియక నినుపోరి దనుజులు
నీచేతమరణించి నిన్నుపొందె
నిజమేదొ తెలియకా నీపత్నినానాడు
నిప్పులోదూకంగ నెరపినావు
నిజమేదొ తెలియకే నింద సత్రాజిత్తు
నినుజేసి సుతనిచ్చి నిన్నువేడె
నిజమేదొ తెలియంగ నీవన్నియును వీడి
నీఅహింసా జ్యోతి నింపినావు

తే॥ 'నిజము' నేర్వజూచిన 'మాయ' నింపుతావు
నిజము నాబోటి అల్పులు నేర్వగలరె
నిజము నిజమయ్య నీపాద రజముచాలు
చిత్తగించుము ఓప్రభూ శ్రీనివాస

సీ॥ కక్షతో రగులుచు కనుమిన్ను గానక
ఆ హిరణ్యాక్షుండు అంతమయ్యె
కక్షతో రగులుచు కామినిలంకలో
సీతాపహరణమ్ము చేసి నీల్గె
కక్షతో రగులుచు ఖలుడు ఆ రారాజు
వదినె కెగ్గులు చేసి "వసుధ వీడె"
కక్షతో రగులుచు ఘనులెందరో చేర
భరతమాతయ్యె "పరుల దాసి"

తే॥ కక్ష పెంచును కక్షనే కుక్షియందు
కక్షమానుచు బ్రతుకుట రక్షయగును
దీక్షితుని మాట నిజమయ్య దీనబంధు
చిత్తగించుము ఓదేవ శ్రీనివాస

సీ॥ స్వర్గంబు లేదని చక్కగా తెలియును

శాంతియే మనిషికి స్వర్గమయ్య

మావారు గొనకొని మాకు విధేయులై

మనుటయే స్వర్గంబు మరొకటేది

మా వెనకైనను మమునుతించుట కన్న

అమృతము మేలౌనె అవనియందు

మా పిల్ల పాపలు మముతల్చి రోదించ

సుఖమేది దివిజేరి చూచు కన్న

తే॥ రంభకౌగిలి సుఖములు రాజ్యములును

దివ్య భోగాలు లేవంచు తెలిసెనాకు

శాంతినుండుటే జతలేని స్వర్గమయ్య

చిత్తగించుము నా మాట శ్రీనివాస

సీ॥ అష్టోత్తరంబులు అన్నదానంబులు
ఎవరినీ కాయవు ఇది నిజంబు
మంటలో నడిరేయి ఇంటిని గోల్పోవు
వానికి చోటీని భవనమేల
వరదలో కోల్పోయి బావురుమనువారి
దయజూచి కాయని ధనమదేల
బలహీనులౌవారి బాసటగానిల్చి
ప్రాణాలు కాయని బలమదేల

తే॥ మడి యనంచును తాకని మనుషులేల
మానమే వీడి చరియించు మహిళలేల
స్వామి నిను చేరుకోనట్టి జన్మయేల
చిత్తగించుము ఓ ప్రభూ శ్రీనివాస

సీ॥ సత్యనారాయణా సాయము రావయ్య

అన్నవరము నుండి అన్న! రావె

భద్రాద్రి రామయ్య భయము తీర్చెడివాడ

భక్తవరదుడ అభయంబునీవె

రంగనాయకుడవై రంజింపవే నన్ను

నెల్లూరిలోనున్న నల్లనయ్య

శ్రీశైలమల్లయ్య చింత తీర్చగరావె

శీఘ్రమే నను పైకి చేదుకోవె

ఆ॥ ఏడు కొండలెక్కి వేడుకో లేనయ్య

ఒకటి చేయగలను ఒప్పుగాను

నిన్ను నేను విడను, నన్ను కాపాడవా

చిత్తగించవయ్య శ్రీనివాస

సీ॥ నేను తెలుసుకుంటి నిజమైనయీమాట
దేవరా వినుమయ్యదాని నిపుడు
నీవెనా దిక్కని భావించి తదుపరి
నమ్మిక విడబోను నష్టమైన
ఊసినా ముఖముపై ఊకొను బానిసై
పదములు విడవను పద్మనాభ
తిట్టినా ఓర్తువు ఏడ్చుచు దీనులు
తండ్రివి కనుకనే ధరణినాథ

తే॥ నాకు అన్యథా శరణమే నాస్తియంచు
నిన్ను నమ్ముచు దయకోరి నెగడుదాక
కొలిచి కొలుచుచు కొలుచుచు కొలుచుచుందు
చిత్తగించుము ఓ స్వామి శ్రీనివాస

# మంగళం

సీ॥ పద్యాలలో గీత వచనంబులో గీత
వ్రాశాను నీదయన్ వాసుదేవ
ధన కనకంబులు ఘనముగ వాహనాల్
నాకేల దయజూపు నళిననాభ
నిన్నిట్లు పొగడుచు నేను వ్రాశానయ్యా
శతకము నిపుడు కేశవుడవంచు
సూక్తులు నాకేల చూడగోరెదనిన్ను
దానికై పోదు నాదారి నేను

తే॥ మంగళంబును పలికెద మాధవునకు
మంగళంబగు దీని ఏమారకుండ
మంగనాథుని ప్రీతికి మరల మరల
మంగళంబుగ చదివిన మాకు కృష్ణ